క్లుప్తంగా

తాగునీటి పైపులైన్ లీకేజీ



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కార్పొరేషన్ కార్యాలయానికి కొంచెం దూరంలో పైపులైన్ లీకేజీ వల్ల తాగునీరు వృథాగా రోడ్డు మీద పారుతోంది. తాడేపల్లి భరతమాత సెంటర్ నుంచి ముగ్గు రోడ్డు ఓవర్‌హెడ్ ట్యాంక్‌కు ప్రతి రోజు పంపింగ్ ద్వారా తాగునీటిని సరఫరా చేస్తున్నారు. రెండుమూడు రోజుల క్రితం ఇదే ప్రాంతంలో పైపులైన్ మరమ్మతులకు గురైంది. సిబ్బంది పైపులైన్ మరమ్మతులు చేసి, గుంతలు పూడ్చడం మరిచారు. తిరిగి మళ్లీ అదే ప్రాంతంలో పైపులైన్ లీకేజ్ అయి వృథాగా రోడ్డుమీద నీరు ప్రవహిస్తోంది. తాగునీరు కలుషితం కాకుండా వెంటనే అధికారులు మరమ్మతులు చేయాలని ప్రజలు కోరుతున్నారు.

మంచి మనిషి మాణిక్యవేలు



తాడికొండ: ఎందరో పేదలకు ఉపాధి కల్పించిన మంచి మనిషి మాణిక్య వేలు అని, ఆయన మరణం కుటుంబంతో పాటు అందరికీ తీరని లోటు అని వైఎస్సార్ సీపీ తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు అన్నారు. ఇటీవల మరణించిన ట్రిపుల్ ఎక్స్ సబ్బుల కంపెనీ అధినేత మాణిక్యవేలు కుమారుడు పర్విన్ బాబు, కుటుంబ సభ్యులను ఆయన సోమవారం పరామర్శించారు. అనంతరం మాణిక్య వేలు చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ తమిళనాడు ప్రాంతం నుంచి సాధారణ వ్యక్తిగా వచ్చిన మాణిక్య వేలు వ్యాపార రంగాన్ని నమ్ముకొని అట్టడుగు స్థాయి నుంచి పారిశ్రామిక వేత్తగా ఎదిగారన్నారు. వేల కుటుంబాలను పోషిస్తూ ఆదర్శ జీవితం గడిపాడని కొనియాడారు.

ఎంటీఎంసీ కమిషనర్‌కు సత్కారం



తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని కనకదుర్గ వారధి కింద ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా సోమవారం పర్యటించారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా పరిసరాలను పరిశీలించారు. స్థానిక భవానీ జల శంకర ఆలయ కమిటీ సభ్యులు ఆయనను ఘనంగా సన్మానించారు. కనకదుర్గ వారధి నుంచి ఆలయం వరకు సీసీ రోడ్డు నిర్మాణం, వీధి లైట్లు ఏర్పాటు చేయాలని వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్ మన్నెం రమేష్‌బాబు, ఆలయ కమిటీ చైర్మన్ శివన్నారాయణ, కార్యదర్శి గోపాలకృష్ణ, కమిటీ సభ్యులు బాలు, సుబ్బారావు, శ్రీనివాసరావు, బసవరాజు, సురేష్, వెంకటేశ్వరరావు, బాబ్జి పాల్గొన్నారు.

ద్విచక్ర వాహనం చోరీ



తాడేపల్లిరూరల్ : తాడేపల్లి పోలీస్‌స్టేషన్ పరిధిలోని బొమ్మల మండపం వద్ద ఇంటి ముందు పార్క్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైంది. ఈ ఘటనపై వాహన యజమాని సోమవారం తాడేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. బాధితుడు మేక నరేంద్రరెడ్డి వివరాల మేరకు.. తాడేపల్లి మెయిన్ రోడ్డులోని బొమ్మల మండపం వద్ద పాత పోస్టాఫీస్ ఎదురుగా తన ఇంటి ఆవరణలో ఏపీ 37 బీయూ 7866 నంబరు గల బ్లాక్ కలర్ పల్సర్‌ను పార్క్ చేశాడు. గుర్తుతెలియని వ్యక్తులు తెల్లవారుజామున హ్యాండిల్ లాక్ తొలగించి ద్విచక్ర వాహనాన్ని దొంగిలించారు. ఈ సంఘటనపై తాడేపల్లి పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానని తెలిపారు. తాడేపల్లి పట్టణ రూరల్‌లో గత కొంతకాలంగా ఇళ్ల ముందు, రోడ్లపై పార్కు చేసిన ద్విచక్ర వాహనాలు తరచు చోరీకి గురి అవుతున్నాయి. నెల రోజుల వ్యవధిలో సుమారు 15 ద్విచక్ర వాహనాల వరకు చోరీకి గురి అయినట్లు సమాచారం. దొంగిలించిన వాహనాలపై ఫిర్యాదు చేసినా కేసు నమోదు చేయడం లేదని విమర్శలొస్తున్నాయి.

ఆధార్ మొబైల్ క్యాంపులు

దుగ్గిరాల: మండలంలోని తొమ్మిది గ్రామాల్లో మార్చి 19 నుంచి 28వ తేదీ వరకు మొబైల్ ఆధార్ క్యాంపులు ఏర్పాటు చేస్తున్నట్లు ఎంపీడీఓ ఎ.శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలోఆయన వివరాలు వెల్లడించారు. ఆధార్‌లో పేర్ల తప్పులు, చిరునామాలోని మార్పులు చేర్పులు ఆధార్ లేని చిన్న పిల్లలుకి కొత్తగా నమోదు చేసుకోవచ్చునని తెలిపారు. ఆధార్ క్యాంపు అంగన్‌వాడీ కేంద్రాలు, సచివాలయాల్లో నిర్వహిస్తారని, ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగ పరుచుకోవాలని కోరారు.

పుష్ప విలాపం

- విరగబూస్తున్న పూల తోటలు
- మార్కెట్ మాయతో రైతుల కన్నీరు
- కర్షకుడి దగ్గర చవకగా దళారీ కొనుగోలు
- కొనుగోలుదారుడికి అధిక ధరకు విక్రయం
- పట్టించుకోని అధికారులు



విరబూసిన చామంతి

తాడేపల్లి రూరల్: పూలమ్మిన చోటే రైతులు కన్నీరు పెట్టాల్సి వస్తోంది. తోటలో ఆకాశం వైపు చూస్తూ విరగబూసినా పూలను.. మార్కెట్‌కు తీసుకెళ్లగానే ధరలు నేల చూపులు చూస్తున్నాయి. రైతు నుంచి దళారీ దగ్గరకు..అక్కడి నుంచి కొనుగోలుదారుడికి వరకు వెళ్లే సరికి ధరల్లో వ్యత్యాసం అమాంతం పెరిగిపోతోంది. మార్కెట్ మతలబు కర్షకులకు నష్టాలనే మిగుల్చుతోంది.

తాడేపల్లి మండల పరిధిలోని ఉండవల్లి, పెనుమాక, కుంచనపల్లి, మెల్లెంపూడి, వడ్డేశ్వరం, మంగళగిరి రూరల్ పరిధిలోని నూతక్కి, పెదవడ్లపూడి, చినవడ్లపూడి, చిన కాకాని, దుగ్గిరాల మండలంలోని పలు గ్రామాల్లో అధిక సంఖ్యలో రైతులు పూల తోటలను సాగుచేస్తున్నారు. అయితే ఈ ఏడాది పంట అయితే విరగబూసింది కానీ, గిట్టుబాటు ధర దళారుల చేతిలో చిక్కుకుపోయి వాడిపోతోంది. మార్కెట్‌లో దళారులు రైతుల నుంచి కేజీ గులాబీలను రూ.70లకు కొనుగోలు చేస్తున్నారు. ఇక్కడ రైతు మాత్రం పూలు కోసిన ఒక్కో మహిళకు రూ.120 కూలి ఇవ్వాల్సి వస్తోంది. గులాబీకి ఉన్న రేటు తలుచుకుంటేనే గుండెల్లో ముళ్లు గుచ్చుకుంటున్నాయని సాగుదారులు వాపోతున్నారు. ఇక కనకాంబరాలు రేటు చెబితేనే కంటనీరు పెట్టుకుంటున్నాడు. కేజీ కనకాంబరాలు రైతుల నుంచి రూ.350లకు కొనుగోలు చేయగా, కోసినందుకు కూలీ రూ.130 అవుతోంది. ఇలా కేజీ లిల్లీ రూ.140, బంతి రూ. 20గా ధరలు ఉన్నాయి. దీంతో కూలీ, పెట్టుబడి ఖర్చులు కూడా వచ్చేట్టులేవని పూల రైతులు ఆందోళన చెందుతున్నారు.

కర్ణాటక నుంచి దిగుబడి

పూలవ్యాపారులు ధరలపై స్పందిస్తూ.. కర్ణాటక నుంచి అధిక సంఖ్యలో పూలు మార్కెట్‌కు వస్తున్నాయని చెబుతున్నారు. తాము రైతుల నుంచి పూలు తీసుకుంటున్నాం గానీ, వాటిని అమ్మలేక రెండవ రోజు చెత్త కుండిల్లో పారిబోస్తున్నట్లు చెబుతున్నారు. ధర లేదని పూలను కోయకుండా ఉంచితే తోట పూర్తిగా పాడవుతుందని రైతులు చెబుతున్నారు. రైతులకు ముహూర్తాలు లేవు, పండుగలు లేవు అంటూ వ్యాపారులు కుంటిసాకులు చూపిస్తూ తక్కువ ధరకు కొనుగోలు చేసి, వారు మాత్రం అధిక ధరకు అమ్ముకుంటున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. తమ వద్ద కొనుగోలు చేసే ధరకు, మార్కెట్ ధరకు చాలా వ్యత్యాసం కనిపిస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు వెంటనే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని కోరుతున్నారు.

పూలు	కేజీ(రైతువద్ద) రూ.	వ్యాపారుల వద్ద రూ.
మల్లెపూలు	300	500-800
కాగడ మల్లి	120	250
బంతిపూలు	15-20	50-80
కనకాంబరం	350	700-900
చామంతి	50-70	120-180
గులాబి (నాటు)	70-80	100
లిల్లి	140	200-350



బంతిపూలు తోటలో నుంచి కోసుకు వస్తున్న మహిళ (ఫైల్)

అప్పుల పాలు అవ్వాల్సిందే..



నేను మూడు ఎకరాల్లో బంతి, లిల్లీ సాగుచేస్తున్నాను. ఎకరాకు కౌలు కాక రూ.40 వేలు పెట్టుబడి అయింది. ఈ సారి పెట్టుబడి కూడా చేతికి అందే అవకాశం లేదు. కనీసం కూలీల ఖర్చు కూడా రావడం లేదు. ఇదే పరిస్థితి కొనసాగితే ఈ ఏడాది అప్పులపాలు కావాల్సిందే.

– శ్రీనివాసరావు, రైతు, తాడేపల్లి

మార్కెట్ రేటు చెప్పడం లేదు



నేను చామంతి, గులాబీ తోట వేశాను. పూలైతే విరగబూస్తున్నాయి. దీంతో కూలీలను ఎక్కువ మందిని పెట్టి కోయించాల్సి వస్తోంది. మార్కెట్‌కు తీసుకువెళితే మేము ఎన్ని కేజీలు ఇచ్చామో రాసి ఇస్తున్నారు. కానీ, రేటు మాత్రం చెప్పడం లేదు. ఇదేమని అడిగితే అమ్మిన తర్వాత రేటు చెబుతామంటున్నారు. మరుసటి రోజు వెళితే పూలు ఎవరూ కొనలేదు, మీ పూలు మీరు తీసుకువెళ్లండని, లేకుంటే చెత్తకుప్పలో పారబోయండని చెబుతున్నారు.

– తమ్మా చెన్నారెడ్డి, రైతు, ఉండవల్లి

కేఎల్‌యూలో 6 రోజుల కార్యశాల ప్రారంభం

తాడేపల్లిరూరల్: తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం కేఎల్ యూనివర్శిటీ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ సంయుక్తంగా యూనివర్శిటీ బీసీఏ విద్యార్థులకు క్లౌడ్ కంప్యూటింగ్, డేటా సైన్స్ పైథాన్‌లో నైపుణ్యాలు మెరుగుపరిచేందుకు 6 రోజుల కార్యశాలను సోమవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య కె.సుబ్రహ్మణ్యం పాల్గొని, జ్యోతి ప్రజ్వలన చేశారు. వర్సిటీ వీసీ డాక్టర్ జి.పార్థసారథి వర్మ మాట్లాడుతూ ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ నుంచి వచ్చిన నలుగురు ట్రైనర్లు విద్యార్థులకు శిక్షణ ఇచ్చారని, గ్లోబల్ సర్టిఫికేషన్స్‌ను సాధించడమే కాకుండా చక్కని ఉపాధి అవకాశాలను పొందుతారని తెలిపారు. ఉన్నత విద్యావకాశాలు కూడా పెరుగుతాయని వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ కె.రాజశేఖరరావు, డాక్టర్ ఎన్.వెంకట్రామ్, రిజిస్ట్రార్ డాక్టర్ కె.సుబ్బారావు, స్కిల్ డెవలప్‌మెంట్ స్టూడెంట్స్ ప్రోగ్రెషన్ డీన్ ఆచార్య డాక్టర్ ఎ. శ్రీనాథ్, బీసీఏ విభాగాధిపతి డాక్టర్ భగవాన్, అధ్యాపకులు రామకృష్ణ, హేమలత, సిద్ధార్థరెడ్డి పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేసి కార్యశాలను ప్రారంభిస్తున్న ప్రిన్సిపల్ డాక్టర్ కె.సుబ్రహ్మణ్యం

నిత్యావసర సరుకులు పంపిణీ



రెంటచింతల: స్థానిక రేగుల మాణ్యం కాలనీలోని 30 చెంచు కుటుంబాలకు ఐ.టి.డి శ్రీశైలం ద్వారా 10 రకాల నిత్యావసర సరుకులను సోమవారం పంపిణీ చేసినట్లు గ్రామ పంచాయతీ కార్యదర్శి జి.అనంత కోటేశ్వరరావు తెలిపారు. ఫుడ్ బాస్కెట్ స్కీం కింద ఈ పేద కుటుంబాలకు నూనె, కందిపప్పు తదితర సరుకులను అందజేయడం జరిగిందన్నారు. పీహెచ్‌సీ మాజీ చైర్మన్ బి.రామకృష్ణ, మూలి రాజారెడ్డి, ఓరుగంటి ఇన్నారెడ్డి, మారాజు శ్రీను తదితరులున్నారు.

ప్రారంభమైన టెన్త్ పరీక్షలు

ఫిరంగిపురం: మండల కేంద్రంలోని మూడు కేంద్రాల్లో పదవ తరగతి పరీక్షలు సోమవారం ప్రశాంత వాతావరణంలో నిర్వహించినట్లు ఎంఈవో షేక్.మహబూబ్‌సుభాని తెలిపారు. మొత్తం 650 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరైనట్లు చెప్పారు.

దుగ్గిరాలలో..

దుగ్గిరాల: పదోవ తరగతి పబ్లిక్ పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. దుగ్గిరాల మండల పరిధిలో ఐదు పరీక్ష కేంద్రాల్లో పరీక్షలు జరిగాయి. ఉదయం 8.30 గంటల నుంచే కేంద్రాల వద్దకు విద్యార్థులు తల్లిదండ్రులతో కలసి వచ్చారు. 9 గంటల నుంచి విద్యార్థులను కేంద్రాల్లోకి అనుమతించారు. హాల్‌టిక్కెట్ నంబర్లు తెలియజేసే బోర్డులను ఏర్పాటు చేశారు. అలాగే విద్యార్థులకు అవసరమైన మంచినీరు, ఇతర వసతులు కల్పించారు. మొదటి తెలుగు పరీక్షకు దుగ్గిరాల పరిధిలో మొత్తం 631 మంది విద్యార్థులకు 626 మంది హాజరైనట్లు ఎంఈఓ కాజా శ్రీనివాసరావు తెలిపారు. ఫ్లెయింగ్ స్క్వాడ్ వి.శంకరరాజు ఎగ్జామ్స్ సెంటర్‌లను పరిశీలించారు.

పోలేరమ్మ సన్నిధిలో వజ్రబాబు

దామరపల్లి(తాడికొండ): మండలంలోని దామరపల్లి గ్రామంలో పోతురాజు, పోలేరమ్మ ఆలయ వార్షిక తిరునాళ్ల సోమవారం వైభవోపేతంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో మహిళలు, భక్తులు అధిక సంఖ్యలో చేరి అమ్మవారి ఆలయం వద్ద పొంగళ్లు చేసి మొక్కులు తీర్చుకోవడంతో సందడి వాతావరణం నెలకొంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా తాడికొండ నియోజకవర్గ వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త వనమా బాల వజ్రబాబు పాల్గొని ఆలయంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంస్కృతీ సంప్రదాయాలతో ప్రతి ఏటా దామరపల్లిలోని పోతురాజు, పోలేరమ్మ ఆలయంలో వార్షిక తిరునాళ్లను నిర్వహించడం హర్షణీయమన్నారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట గ్రామ సర్పంచ్ నల్లిబోయిన సరస్వతి, ఉప సర్పంచ్ గుడిమెట్ల సుజాత, బండారుపల్లి సర్పంచ్ ముప్పాళ్ళ మనోహర్, మాజీ సొసైటీ చైర్మన్ వంగా పోలారెడ్డి, నల్లిబోయిన శ్రీనివాసరావు, బాకి వెంకటస్వామి, షేక్ బాజీ, స్థానిక నాయకులు తాడిబోయిన హనుమంతరావు, బోరుగడ్డ సాంబశివరావు, బొల్లెద్దుల శివాజీ, కాజ సాంబిరెడ్డి ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ నగదు చెక్కు అందజేత

తాడేపల్లి రూరల్ : ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన నగదు చెక్కును సోమవారం టీడీపీ నాయకులు బాధిత కుటుంబానికి అందజేశారు. కుంచనపల్లి గ్రామానికి చెందిన జంపాల వెంకటేశ్వరరావు గుండె, ఊపిరితిత్తుల ఆపరేషన్‌లకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.1,25,000 మంజూరు అయ్యాయి. ఈ మేరకు ఆ చెక్కును లబ్ధిదారుని ఇంటికి వెళ్లి స్థానిక నాయకులు అందజేశారు. టీడీపీ నాయకులు అమరా సుబ్బారావు, జనసేన నాయకులు మేకల రాజా పాల్గొన్నారు.



చెక్కు అందజేస్తున్న స్థానిక టీడీపీ నాయకులు

చేనేతల అర్ధనగ్న ప్రదర్శన

మంగళగిరి టౌన్ : రాష్ట్ర బడ్జెట్‌లో చేనేతకు జరిగిన అన్యాయాన్ని నిరసిస్తూ ఆంధ్రప్రదేశ్ చేనేత కార్మిక సంఘం రాష్ట్ర సమితి ఆధ్వర్యంలో సోమవారం అర్ధనగ్న ప్రదర్శన నిర్వహించారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయం నుంచి గౌతమ బుద్ధ రోడ్డు మీదుగా అంబేద్కర్ బొమ్మ వరకు ఈ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పిల్లలమర్రి నాగేశ్వరరావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం బడ్జెట్ కేటాయింపుల్లో చేనేతలకు రూ.138 కోట్లు మాత్రమే కేటాయించి, మోసం చేసిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. తక్షణమే బడ్జెట్ సవరించి చేనేత రంగానికి రూ.2 వేల కోట్లు కేటాయించాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగం తరువాత అతిపెద్ద చేనేత పరిశ్రమను నిర్వీర్యం చేయడానికి కూటమి ప్రభుత్వం చూస్తున్నట్లు ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. చేనేత సహకార సంఘాలకు ఇవ్వాల్సిన నిధులను తక్షణమే విడుదల చేయాలని, సంఘాలకు ఎన్నికలు నిర్వహించాలని డిమాండ్ చేశారు. ఏపీ చేనేత కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి బత్తూరి మోహనరావు, సీపీఐ నియోజకవర్గ కార్యదర్శి చిన్న తిరుపతయ్య, పట్టణ కార్యదర్శి అన్నవరపు ప్రభాకర్ పాల్గొన్నారు.



అర్ధనగ్న ప్రదర్శన చేస్తున్న చేనేత కార్మిక సంఘం నాయకులు

కార్మికుల సమస్యను పరిష్కరించాలి

తాడేపల్లిరూరల్ : బ్రహ్మానందపురం ఏసీసీ సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూనియన్ నాయకులు కూరపాటి స్టీవెన్ డిమండ్ చేశారు. సోమవారం బ్రహ్మానందపురంలో కార్మికులు నిర్వహిస్తున్న దీక్షా శిబిరాన్ని ఆయన సందర్శించి, కార్మికులకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్యాక్టరీకి సంబంధించిన ప్రతి కార్మికుడికి రూ.50 లక్షలు ఇస్తామని, ఒకసారి రూ.30 లక్షలు ఇస్తామని యాజమాన్యం మాట్లాడుతోందన్నారు. కార్మికుల సమక్షంలో చర్చలు జరిపి, న్యాయం జరిగే విధంగా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సీఐటీయూ తాడేపల్లి పట్టణ కార్యదర్శి వేముల దుర్గారావు మాట్లాడుతూ ప్రభుత్వం ఇప్పటికైనా జోక్యం చేసుకుని సిమెంట్ ఫ్యాక్టరీ కార్మికుల సమస్యను పరిష్కరించాలన్నారు. నాయకులు కె.ఆదినారాయణ, కార్మికులు నాగేశ్వరరావు, సుబ్బారావు, ఇమాంబి, మల్లేశ్వరి, రమాదేవి, దుర్గా భవాని, శారద, లక్ష్మి, గురవయ్య, సారమ్మ, ఆశీర్వాదం, యహోషువా, రిబ్కా పాల్గొన్నారు.



కార్మికులతో మాట్లాడుతున్న వేముల దుర్గారావు, యూనియన్ నాయకులు

వైభవంగా వేణుగోపాలస్వామి కల్యాణం

ఫిరంగిపురం: మండలంలోని 113 తాళ్లూరు గ్రామంలో ఉన్న రుక్మిణీ, సత్యభామ సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో నూతన జీవ ధ్వజస్తంభ ప్రతిష్ఠ సోమవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం వైఖానస ఆగమ పండితులు విష్వక్సేన పూజ, పుణ్యాహవాచనం, ఉక్తహోమం, రత్నన్యాసం, అగ్నిధ్యానం, హోమం పూర్ణాహుతి నిర్వహించారు. అనంతరం పండితులు దీవి ఫణికుమార్, పవన్‌కుమార్, డీడీకే ఆచార్యులు, రఘురామ్, సురేష్‌కుమార్ ఆధ్వర్యంలో ధ్వజ స్తంభ ప్రతిష్ఠ నిర్వహించారు. ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వేదికపై రుక్మిణీ సత్యభామ సమేత వేణుగోపాలస్వామి శాంతి కల్యాణం నిర్వహించారు. పూజా కార్యక్రమంలో దాత, రాష్ట్ర ఇండస్ట్రియల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డేగల ప్రభాకర్, భువనేశ్వరి, ప్రముఖ కార్డియాలజిస్ట్ డాక్టర్ రాజా దంపతులు పాల్గొన్నారు. కార్యక్రమాలను ఈవో జె.శ్రీనివాసరావు పర్యవేక్షించారు. అన్నదానం చేశారు.



శాంతి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు

నెల రోజుల్లో స్వచ్ఛ మంగళగిరిగా చేద్దాం

మంగళగిరి టౌన్: మంగళగిరి నగరపాలక సంస్థను స్వచ్ఛ మంగళగిరిగా చేసేందుకు ప్రతి ఒక్కరు సహకరించాలని ఎంటీఎంసీ కమిషనర్ అలీమ్‌బాషా కోరారు. కార్పొరేషన్ పరిధిలో స్వచ్ఛ మంగళగిరి పేరిట ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమాన్ని నిర్వహించారు. పలు ప్రాంతాల్లో అధికారులు, నాయకులతో కలసి ఇంటింటికి వెళ్లి పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించారు. కార్పొరేషన్ సిబ్బంది, మున్సిపల్ సిబ్బంది, నాయకులతో ప్రతిజ్ఞ చేయించారు. అలీమ్‌బాషా మాట్లాడుతూ కాలువలో చెత్తను వేయవద్దని, ప్లాస్టిక్ సంచులు వాడవద్దని, తడి పొడి చెత్తను వేరుచేసి పారిశుద్ధ్య కార్మికులకు ఇవ్వాలని పేర్కొన్నారు. నెల రోజుల పాటు 65 సచివాలయాల పరిధిలో స్పెషల్ డ్రైవ్ ద్వారా చెత్తను తొలగించడం, ప్రతి ఇంటికి వెళ్లి పారిశుద్ధ్యంపై అవగాహన కల్పించాలని ఉద్యోగులను ఆదేశించారు. 30 రోజుల పాటు అన్ని వార్డుల్లో పూర్తిస్థాయిలో చెత్తను తొలగించడం జరుగుతుందని తెలిపారు. స్వచ్ఛ మంగళగిరి కోసం 75 మంది పారిశుద్ధ్య కార్మికులను అదనంగా నియమించినట్లు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అడిషనల్ కమిషనర్ శకుంతల, సెక్రటరి దివ్యకుమారి, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ రమేష్, అసిస్టెంట్ ఇంజనీర్ ప్రసన్నజ్యోతి, శానిటరి ఇన్‌స్పెక్టర్లు, టౌన్ ప్లానింగ్ అధికారులు పాల్గొన్నారు.



చెత్తను తొలగిస్తున్న కమిషనర్ అలీమ్‌బాషా, సిబ్బంది

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యను పరిష్కరించండి

మంగళగిరి టౌన్ : అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ మంగళగిరి నియోజకవర్గ గౌరవాధ్యక్షుడు చిన్ని తిరుపతయ్య అన్నారు. మంగళగిరి పట్టణ పరిధిలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తిరుపతయ్య మాట్లాడుతూ అగ్రిగోల్డ్ బాధితుల సమస్య పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు. అధికారంలో ఉన్న కూటమి ప్రభుత్వం ఎన్నికల మ్యానిఫెస్టోలో అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు డిపాజిట్ చెల్లిస్తామని వాగ్దానం చేసిందని గుర్తుచేశారు. 9 నెలలు గడిచినా ఇప్పటి వరకు ఆ దిశగా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. అగ్రిగోల్డ్ అంశంపై ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి న్యాయపరమైన చిక్కులను తొలగించాలని డిమాండ్ చేశారు. బుధవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నాచౌక్ వరకు అగ్రిగోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్ర నిర్వహిస్తున్నామని, ఈ పాదయాత్రలో అగ్రిగోల్డ్ బాధితులు పాల్గొని జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న చిన్ని తిరుపతయ్య

అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు పరిష్కరించాలి


ఫిరంగిపురం: అగ్రిగోల్డ్ బాధితుల సమస్యలు ప్రభుత్వం పరిష్కరించాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ కోరారు. మండల కేంద్రంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బుధవారం తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించే అగ్రి గోల్డ్ బాధితుల కన్నీటి పాదయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. కూటమి నేతలు ఎన్నికల సమయంలో బాధితులను ఆదుకుంటామని ఇచ్చిన హామీని గుర్తుచేశారు. కానీ, నేటి వరకు ప్రభుత్వం ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం బాధాకరమన్నారు. బాధితుల కష్టార్జితం వారికే దక్కాలని ఇచ్చిన మాటను ప్రభుత్వం నిలబెట్టుకోవాలని డిమాండు చేశారు. అనంతరం ఇంటింటికి కరపత్రాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో షేక్.కరిముల్లా, మాదాను చిన్నప్ప, ధర్మవరపు కిషోర్, అలీభాయ్ పాల్గొన్నారు.



నాలుగు ఇసుక ట్రాక్టర్ల సీజ్

కొల్లిపర: ఇసుకను అక్రమంగా రవాణా చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్‌ఐ పి.కోటేశ్వరరావు తెలిపారు. అనుమతులు లేకుండా ఇసుకను అక్రమంగా తరలిస్తున్న నాలుగు ట్రాక్టర్లను సోమవారం సీజ్ చేసినట్లు ఆయన చెప్పారు. డ్రైవర్ల దగ్గర పత్రాలు లేకపోవడంతో కేసు నమోదు చేసి, ట్రాక్టర్లను రెవెన్యూ అధికారులకు అప్పగించినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత ఇసుక విధానం మండలంలోని నది పరీవాహక ప్రాంతాలైన అత్తలూరివారిపాలెం, వల్లభాపురం, మున్నంగి, పిడపర్రు, పిడపర్తిపాలెం, కొల్లిపర, హనుమాన్‌పాలెం, అన్నవరం, గొడపాలెం గ్రామాలకు మాత్రమే వర్తిస్తుందని చెప్పారు. మిగిలిన గ్రామాలకు గానీ, పట్టణాలకు గానీ ఉచితంగా ఇసుకను తరలించడానికి అనుమతుల్లేవని పేర్కొన్నారు. వేబిల్లు లేకుండా అనుమతులు లేని ప్రదేశాలకు ఇసుక తరలించే వారిపై చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఇటీవల మండలంలో దొంగ వే బిల్లు ద్వారా ఇతర ప్రదేశాలకు ఇసుక తరలిస్తున్నారని సమాచారం ఉందన్నారు.

ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి



తెనాలి టౌన్: ఆధ్యాత్మిక భావనతో సమాజంలో శాంతి వర్ధిల్లుతుందని శ్రీ రమాసహిత సత్యనారాయణస్వామి దేవస్థానం అర్చకులు రొంపిచర్ల మారుతీ చక్రవర్తి పేర్కొన్నారు. బోసు రోడ్డులోని శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరి దేవస్థానం ప్రాంగణంలో ఉన్న శ్రీ రమాసహిత సత్యనారాయణ స్వామి అష్టమవార్షిక బ్రహ్మోత్సవాలు మంగళవారం వైభవంగా ముగిశాయి. స్వామికి విష్వక్సేన పూజ, పుణ్యావాహం, కుంభారాధన, అగ్ని ధ్యానం, విశేష హోమం, చక్రస్నానం, పూర్ణాహుతి, కుంభాభిషేకం, హారతి తదితర కార్యక్రమాలు నిర్వహించారు. భక్తులు పెద్దసంఖ్యలో పాల్గొని స్వామిని దర్శించుకుని తీర్థప్రసాదాలు స్వీకరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షులు నూకల వెంకట వేణుగోపాలరావు, ఇన్‌చార్జి కార్యదర్శి వక్కలగడ్డ గంగాధరరావు, సభ్యులు పాల్గొన్నారు.

డాక్యుమెంట్స్ పోయినవి

యిమ్మడిశెట్టి సుబ్బారాయుడు S/o. వెంకటేశ్వర్లు, నివాసం: వైశ్యుల పెద్ద బజారు, కందుకూరు మున్సిపాలిటీ, నెల్లూరు జిల్లా. నా పేరున మరియు వెన్నపూస రామ సుబ్బారెడ్డి S/o. వెన్నపూస గంగిరెడ్డి గార్ల పేరున శ్రీ పెదకాకాని సబ్ రిజిస్ట్రారు వారి ఆఫీసులో 1వ పుస్తకం, దస్తావేజు నెం. 4395/2014రు లింకు దస్తావేజు నెం. 4046/2014రు మరియు దస్తావేజు నెం. 2062/1997రు ఒరిజినల్ దస్తావేజులు కందుకూరులో మా ఇంటి నుండి జిరాక్స్ నిమిత్తం వెళ్ళగా మార్గ మధ్యలో పోయినవి. దొరికినవారు అందజేయగలరు.
సెల్: 9949200450